రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సాయికుమార్(ఫైల్)

దండేపల్లి, డిసెంబర్15: దండేపల్లి మండలంలోని కొర్విచెల్మ గ్రామానికి చెందిన బెంబడి సాయికుమార్(21) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఐ ఉదయ్‌కిరణ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 14న సాయంత్రం సమయంలో సాయికుమార్ అతని స్నేహితుడు అల్లం రాజు ఇద్దరు కలిసి మోటార్ సైకిల్‌పై దుస్తులు కొనడానికి లక్షెట్టిపేట వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో ముత్యంపేట వద్ద రోడ్డు ప్రక్కన మోటార్ సైకిల్ ఆపి నిల్చున్నారు. వెనుక నుంచి వచ్చిన లారీ సాయికుమార్‌ను అతి వేగంగా ఢీకొట్టడంతో టైరు కింద పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన సాయికుమార్‌ను 108 అంబులెన్స్‌లో లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అల్లం రాజు స్వల్ప గాయలతో బయటపడ్డాడు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు బోల్తా

మంచిర్యాల (ఏసీసీ), డిసెంబర్ 15: జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డులో కారు బోల్తా పడిన ఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా పని చేసే రాథోడ్ ప్రదీప్ కుమార్ డ్రైవర్‌తో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పార్టీ నుంచి ఇంటికి వెళ్తుండగా బైపాస్ రోడ్డులో అతివేగంగా వెళ్లి, అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొని బోల్తా పడింది. దీంతో స్థానికులు స్పందించిన కారులో నుంచి బాధితులను బయటకు తీసి, పోలీసులకు సమాచారం అందించారు. కారును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కి తరలించారు. ఘటనపై సీఐ స్పందిస్తూ.. ర్యాష్ డ్రైవింగ్ కేసు నమోదు చేసినట్లు, కారు కోసం ఆదివారం సాయంత్రం వరకు ఎవరూ రాలేదని తెలిపారు.

పశువులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

బొలెరో వాహనంలో తరలిస్తున్న పశువులు

పెంచికల్ పేట్,డిసెంబర్ 15 : అక్రమంగా పశువులను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కొమురయ్య అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అక్రమంగా రవాణా చేస్తున్న 8 ఆవులు, ఒక ఎద్దును అగర్ గూడ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా గ్రామ సమీపంలో విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం ఉదయం 6 గంటలకు తనిఖీలు చేసి పట్టుకున్నారు. మద్దెల గంగాధర్, సయ్యద్ అబ్బు, షేక్ రహమత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పశువులను గోశాలకు తరలించారు.

నిర్మాణ పనుల పరిశీలన

మంచిర్యాల (ఏసీసీ), డిసెంబర్ 15: మంచిర్యాల పట్టణంలోని గోదావరి తీరాన ఉన్న మహాప్రస్థానం పనులను మంచిర్యాల ఎమ్మెల్యే పేం సాగర్‌రావు ఆదివారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఐబీ చౌరస్తా వద్ద నూతనంగా నిర్మిస్తున్న మాతా శిశు సూపర్ స్పెషాలిటీ దవాఖాన పనులను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉట్నూర్‌లో దొంగతనాలు

ఉట్నూర్, డిసెంబర్ 15: ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని బోయవాడలో నివాసముంటున్న రిటైర్డు ఉపాధ్యాయుడు కోరుట్ల రాములు ఇంట్లో, అలాగే కిషన్ బీడీ కంపనీ ఇంట్లో ఆదివారం ఉదయం దొంగతనాలు జరిగాయి. ఈ ఇండ్లకు సంబంధించిన యాజమానులు వివిధ కారణాలతో ఊర్లకు వెళ్లారు. ఆదివారం వచ్చి చూసే సరికి ఇండ్లకు తాళాలు పగులగొట్టి ఉండడాన్ని యజమానులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం డాగ్ స్క్వాడ్‌తో పంచనామా చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భైంసాటౌన్, డిసెంబర్ 15 : భైంసా మండలం గుండెగాం వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలకు వెళ్తే ...మండలంలోని మహాగాం గ్రామానికి చెందిన ఎస్ బాలాజీ (48) ఆదివారం రాత్రి భైంసా నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. గుండెగాం వంతెనపై ఎదురుగా వస్తున్న ఎడ్లబండిని ఢీ కొట్టడంతో బాలాజీకి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఘటన స్థలంలోనే మృతి చెందాడు.

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలి

- అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సీ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

మహాసభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 15: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సీ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ అన్నారు. ఆదివారం మంచిర్యాలలోని తాండ్ర పాపారాయుడు ఫంక్షన్‌హాలులో అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం ఆదిలాబాద్ డివిజన్, మంచిర్యాల బ్రాంచ్ 35వ ద్వైవార్షిక మహాసభలు జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ వెంటనే ఎనిమిదవ పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని, గ్రామీణ తపాలా ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని, తపాలాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభల్లో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రావణ్‌కుమార్, పోస్ట్‌మాన్ సంఘం కార్యదర్శి మధుసూదన్, జీడీఎస్ సంఘం కార్యదర్శి బండి జయరాజు, ఉమ్మడి ఉద్యోగ సంఘాల సమన్వయ కన్వీనర్ రంగు రాజేశం, ఇన్సూరెన్స్ ఉద్యోగ సంఘం కార్యదర్శి రాందాస్, సీఐటీయూ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు జీ ప్రకాశ్, మంచిర్యాల బ్రాంచ్ నాయకులు రాజేంద్రప్రసాద్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో ఘనంగా మార్గశిర పౌర్ణమి జాతర

దండేపల్లి, డిసెంబర్15: దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం మార్గశిర పౌర్ణమి జాతరను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ముందుగా గోదావరిలో స్నానాలు చేసి ఆలయంలో స్వామివారిని దర్శించుకుకొని పూజలు చేశారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పూజలు

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 15: మంచిర్యాల పట్టణంలోని పాతమంచిర్యాలలో ఆదివారం అర్చకులు నరహరి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా మండల పడిపూజ కార్యక్రమం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వెరబెల్లి రఘునాథ్, గోనె శ్యాంసుందర్‌రావు, తూముల నరేశ్, కౌన్సిలర్ సునీతాకిషన్, మాజీ కౌన్సిలర్ చింతకింది మల్లయ్య తదితరులు పాల్గొన్నారు .

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 13: విద్యుత్ వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొమ్మెర, ఎర్రగుంటనల్లి గ్రామాలలో విద్యుత్ బిల్లులు చెల్లించాలని మైక్ ద్వారా ప్రచారం చేశారు. వ్యవసాయ మోటర్లు బిల్లులు కూడా చెల్లించాలని కోరారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ రమేశ్‌రెడ్డి, తిరుపతి, సిబ్బంది సురేశ్, మోహన్ రెడ్డి ఉన్నారు.

వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం కార్యవర్గం

నూతనంగా ఎన్నికైన నాయకులు

నస్పూర్, డిసెంబర్ 15: జిల్లా తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా బండి రవి, కోశాధికారిగా కే జ్యోతి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సిరంగి గోపాల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా గాజులు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులుగా సూరం రవి, యండి చాంద్‌పాషా, కే విఠల్, సాంబమూర్తి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. రామ్మోహన్ రావు అధ్యక్షత వహించారు.

ఆల్పోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌కు అనూహ్య స్పందన

నస్పూర్, డిసెంబర్ 15: శ్రీనివాస రామనుజన్ స్మారకార్థం నిర్వహించిన మ్యాథ్స్ టెస్టుకు అనూహ్య స్పందన లభించిందని అల్పోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వీ.నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంతోపాటు లక్షెట్టిపేట, చెన్నూరులలో నిర్వహించిన ఈ పరీక్షలో సుమారు 1840 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15809 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఈ టెస్టులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఈనెల 22న అతిథులచే బహుమతుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

హాజీపూర్, డిసెంబర్ 51 : తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘం పరస్పర సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ మంచిర్యాల జిల్లా అడ్‌హక్ కమిటీని ఆదివారం టీఎన్జీవో భవనంలో సభ్యులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడియారం శ్రీహరి, కార్యదర్శిగా హబీబ్ హుస్సేన్, డైరెక్టర్లు ఎస్ మొండయ్య, భూముల రామ్మోహన్, నాగుల గోపాల్, కళావతి, ఏవీఆర్‌డీ ప్రసాదరావ్, సంగర్స్ సంతోష్, ఇంతియాజ్, ముఖ్య సలహాదారులుగా పుప్పాల హన్మంతరావ్, శ్రీపతి బాపురావ్, పొన్న మల్లయ్య, ఎల్ గోవింద రెడ్డి, తిరుపతి రెడ్డి, జీ హనుమంత రెడ్డి, లలితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన బాడీ తిరిగి ఎన్నికలను నిర్వహించేంత వరకూ కొనసాగుతుందన్నారు. హౌసింగ్ సొసైటీలో 1వ, 2వ పేస్‌లలో గృహాల నిర్మాణాలు జరుగుతున్నవని, కోర్టు కేసులు పూర్తయిన తర్వాత గతంలో వచ్చిన వారికి మూడవ దశ గృహాల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గతంలో ప్లాట్ వచ్చిన వారికి ఎవరికీ అన్యాయం జరుగదని, సభ్యులు అపోహలు పెట్టుకోవద్దని తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మిత్ర బృందం

వేమనపల్లి, డిసెంబర్ 15 : అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి అతని చిన్ననాటి మిత్రులు అండగా నిలిచారు. భీమారం మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల 2007-2008 సంవత్సరంలో చదివిన పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి వేమనపల్లి మండలంలో సుంపుటం గ్రామానికి చెందిన కుబుడే పురుషోత్తం మూడు రోజులు క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అది తెలుసుకున్న పూర్వ విద్యార్థులు వారి ఇంటికి వచ్చి రూ.20 వేలతో పాటు ఆయన జ్ఞాపకార్థం రెండు సిమెంట్ బెంచీలకు రూ.6 వేలు అందించారు. అనంతరం వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవిడపు రవి తేజ, భూక్యా రాజ్ కుమార్ నాయక్, బోగే సమ్మయ్య, మామిడి వెంకటేశ్, పోడెటి ఆశోక్, కుబుడే మధుకర్, తిరుపతి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

- కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- ఆలస్యంగావచ్చిన అభ్యర్థులను అనుమతించని అధికారులు

కాగజ్‌నగర్‌లో తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

నవోదయ విద్యాలయం వద్ద దివ్యాంగురాలిని వీల్‌చైర్‌లో తీసుకెళ్తున్న సిబ్బంది

మందమర్రి, డిసెంబర్ 15: మందమర్రి పట్టణంలో గ్రూప్-2 పరీక్ష మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మంచిర్యాల డీసీపీ భాస్కర్, మందమర్రి సీఐ శశీధర్‌రెడ్డితో కలిసి పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించారు. పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించక పోవడంతో వారు నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు. పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. 168 సెక్షన్ అమలులో ఉండడంతో స్థానికంగా ఉన్న జిరాక్స్ సెంటర్ యజమానులు దుకాణాలను మూసివేశారు.

మొదటి రోజు గ్రూపు-2 పరీక్ష ప్రశాంతంగా

కాగజ్‌నగర్, డిసెంబర్ 15:కాగజ్‌నగర్ పట్టణంలోని ఆయా పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన గ్రూపు-2 మొదటి రోజు ఆదివారం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పోలీసుల ఆధ్వర్యంలో ప్రయాణ ప్రాంగణం ఆవరణలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి వివిధ ప్రాంతాల నుంచి పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులకు వాహనాల ద్వారా పరీక్షా కేంద్రాలకు తరలించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని నవోదయ విద్యాలయం పరీక్షా కేంద్రానికి ముగ్గురు, వసుంధర డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రానికి ముగ్గురు, వివేకానంద డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రానికి ఇద్దరు, సెయింట్ క్లారిటీ పరీక్షా కేంద్రానికి ఇద్దరు విద్యార్థులు నిమిషం ఆలస్యం రావడంతో అధికారులకు లోనికి అనుమతించలేదు. నవోదయ విద్యాలయం పరీక్షా కేంద్రానికి నిమిషం ఆలస్యంగా వచ్చిన విద్యార్థిని కంటతడి పెట్టింది. పుట్టుకతో రెండు చేతులు లేని దివ్యాంగులు జాకీర్ పాషా గ్రూపు-2 పరీక్ష కాళ్లతో రాసి ఆదర్శంగా నిలిచాడు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో పట్టణంలో ఎస్ ఐలు దీకొండ రమేశ్, మహేందర్, రాజయ్య, కానిస్టేబుళ్లు తదితరులు బందోబస్తు నిర్వహించారు.

మందమర్రిలో పరీక్షా కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీసీపీ భాస్కర్

ఫౌంటేన్ కాదు..పైపులైన్ లీకేజీ

మందమర్రి, డిసెంబర్ 15 : సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే-5 గని, శంకర్‌పల్లి గ్రామం సమీపంలో సింగరేణి గోదావరి తాగునీటి సరఫరా పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు వృథాగా పోతున్నది. కేకే- 5 గని, శంకర్‌పల్లి గ్రామం మధ్య రహదారి పక్కన తాగునీటి పైపులైన్ లీకేజీ ఫౌంటేన్‌ను తలపిస్తున్నది. తాగునీరు వృథాగా పోవడంతో పట్టణంలోని పలు వార్డుల్లో సరిపడా తాగునీరు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలకు తాగునీరు సరఫరా చేసే విషయంలో నిబంధనలు విధించే అధికారులు వృథాను అరికట్టేందుకు ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి 20 రోజులైనా ఎవరు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేసి లీకేజీ అరికట్టాలని కోరారు.

పైప్‌లైన్ పగలడంతో వృథాగా పోతున్న తాగునీరు

కేసీఆర్ అక్షరాల ఆకృతిలో వరి నారు

కేసీఆర్‌పై అభిమానాన్ని చాటుకున్న రైతు

దండేపల్లి, డిసెంబర్15: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు దండేపల్లి మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన యువ రైతు రాకేశ్. తన పొలంలోని నారు మడిలో ఇంగ్లిష్‌లో కేసీఆర్ అనే అక్షరాల ఆకారంలో నారు పోసి అభిమానాన్ని చాటుకున్నాడు. నారుమడిలో అక్షరాలను పెంచడంతో పాటు, పొలంలో బీఆర్ఎస్ జెండా పాతిన సెల్ఫీలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

డ్రైనేజీల నిర్మాణంలో నాణ్యతా లోపం

- నీటిలోనే కొనసాగుతున్న నిర్మాణ పనులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- కల్వర్టులు తొలగించడంతో అవస్థలు పడుతున్న ప్రజలు

అవస్థలు పడుతూ చంటిబిడ్డతో డ్రైనేజీ దాటుతున్న మహిళ

డ్రైనేజీ తవ్వకాలతో ప్రమాదకరంగా చెట్టు

మందమర్రి, డిసెంబర్ 15: మందమర్రి మున్సిపాలిటీలో నిర్మిస్తున్న డ్రైనేజీల నిర్మాణంలో నాణ్యతాలోపంతో చేపడుతున్నారని పట్టణ ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి, యాపల్, చొప్పరిపల్లి, మార్కెట్ ఏరియా, శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్ రోడ్డు, రామన్ కాలనీ, పాతబస్టాండ్ ప్రధాన రోడ్ల ఏరియా, ఆర్కే1 సుభాష్ నగర్, నార్లాపూర్ బస్‌స్టేజీ ఏరియాల్లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆరు కోట్ల రూపాయల సీఎస్ఆర్ నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టారు. డ్రైనేజీల నిర్మాణం పనులను ఇటీవల చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఆయా కాలనీల్లో నిర్మిస్తున్న డ్రైనేజీల నిర్మాణంలో సంబంధిత కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదని ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజా ధనం వృథా అవుతున్నదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పాత డ్రైనేజీల స్థానంలోనే కొత్తగా తవ్వకాలు చేపట్టి డ్రైనేజీలను నిర్మిస్తున్నారు. డ్రైనేజీల్లో నీరు పారుతుండగా నీటిలోనే నిర్మాణం పనులు సాగుతున్నాయి. కాలనీలలో నిత్యం ప్రజలు తిరిగే రోడ్లకు డ్రైనేజీల పై గతంలో నిర్మించిన పైకప్పులను తొలగించడంతో ప్రజల రాకపోకలు సాగించేందుకు ప్రజలు, ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ ఏరియాలో శ్రీపతినగర్ వెళ్లే దారిలో డ్రైనేజీ పై పైకప్పును తొలగించారు. నిత్యం వందలాది మంది ప్రజలు, ద్విచక్ర వాహన చోదకులు వివిధ అవసరాలపై ఈ రహదారి గుండా మార్కెట్‌కు వచ్చి వెళుతుంటారు. డ్రైనేజీ నిర్మాణంలో జాప్యం జరగడం, డ్రైనేజీ పై పైకప్పు లేక పోవడంతో ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. డ్రైనేజీ నిర్మాణం నత్తనడకన సాగడంతో పాటు రహదారుల వద్ద పైకప్పులను తొలగించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మార్కెట్ వెనుక వైపు కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి జేసీబీ యంత్రంతో తవ్వకాలు జరపడంతో దుకాణాల వెనుక వైపు గల వేప వృక్షం వేర్లు ఒక వైపు పూర్తిగా తొలగిపోయాయి. దీనితో వేప వృక్షం పటుత్వాన్ని కోల్పోయి దుకాణాల వైపు వంగి ప్రమాదకరంగా తయారైంది. అయినప్పటికీ వృక్షాన్ని పూర్తిగా తొలగించకుండా డ్రైనేజీ నిర్మాణం పనులను కొనసాగిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని సమీప గృహాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేప వృక్షం ప్రమాదకరంగా మారినా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ఎవరు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న వృక్షాన్ని తొలగించడంతో పాటు డ్రైనేజీలను త్వరితగతిన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కవ్వాల్‌లో బర్డ్‌వాచ్

మల్యాల అడవుల్లో పక్షులను కెమెరాలో బంధిస్తున్న పక్షి ప్రేమికుడు

బైసన్‌కుంట వద్ద పర్యాటకులు కెమెరాల్లో చిత్రీకరించిన పక్షులు

జన్నారం,డిసెంబర్ 15 : కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లోని జన్నారం డివిజన్ తాళ్లపేట్ రేంజ్ పరిధిలోని బైసన్‌కుంట ప్రాంతంలో ఆదివారం ఉదయం బర్డ్‌వాచ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎఫ్ఆర్వో సుష్మారావు తెలిపారు. శనివారం రాత్రి 15 మంది పక్షి ప్రేమికులు వచ్చారు. ఆదివారం ఉదయం అడవిలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. బైసన్‌కుంట వద్ద విహరించే వివిధ రకాల అరుదైన పక్షులను వారి కెమెరాల్లో బంధించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ సుష్మారావు, డీఆర్వో తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పేరుతో రైతులను నిర్వాసితులుగా మార్చితే ఊరుకోం

మాట్లాడుతున్నా సీపీఎం కమిటీ సభ్యుడు బండారు రవి

కాగజ్‌నగర్, డిసెంబర్ 15: పులుల సంరక్షణ పేరుతో ఇక్కడి రైతులను నిర్వాసితులుగా మార్చితే ఊరుకోబోమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవి హెచ్చరించారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను నిర్వాసితులుగా మార్చితే సహించబోమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కేంద్రంలోని ప్రభుత్వం అడవులను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పడం కోసం అనేక రకాల పేర్లు చెప్పి అడవి భూములను స్వాధీనం చేసుకునేందుకు ఆదివాసీలను, ఇతర రైతులను నిర్వాసితులను చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. ఇందులో భాగంగానే కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పెద్ద పులులు సంచరిస్తున్నాయని, కాగజ్‌నగర్ టైగర్ కారిడార్ ఏర్పాటు చేస్తే కేంద్రం నుంచి నిధులు వస్తాయనే పేరుతో ఫారెస్ట్ రాష్ట్ర సీసీఎఫ్ జిల్లాలో పర్యటించి కాగజ్‌నగర్ టైగర్ కారిడార్ ఏర్పాటు చేస్తామని చెప్పారని స్పష్టం చేశారు. దీని ద్వారా చాలా గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తుందని, గ్రామాలు ఖాళీ చేయించి ఈ భూములను కార్పోరేట్ కంపెనీలకు అప్పజెప్పడం కోసమే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే జిల్లాలో పులి, ఏనుగు దాడిలో ఆరుగురు మరణించారని, ఒక్కరు గాయపడ్డారన్నారు. పులులను బంధించి తరలించే దానిలో అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే పత్తి పంట తీయాల్సిన సమయం దాటిపోతుందని పులుల భయానికి పత్తి తీసే కూలీలు కూడా రాక రైతులు నష్టపోతున్నారని అన్నారు. టైగర్ కారిడార్ ఆలోచన విరమించుకోవాలని, ఇప్పుడు పత్తి పంటకి ఎకరాకి 50 వేలు నష్టపరిహారం చెల్లించాలని, పులి దాడిలో మరణించిన కుటుంబాలకు రూ. 25 లక్షల నష్టపరిహారం , ఐదు ఎకరాల సాగు భూమి ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీపీఎం కుమ్రం భీం జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్ , జిల్లా కమిటీ సభ్యులు ముంజం శ్రీనివాస్, ముంజం ఆనంద్ కుమార్, నాయకులు ఊట్ల రవి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ఇంటిని పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, నాయకులు

కెరమెరి, డిసెంబర్ 15: మండలంలోని కొలాంగూడ(తుమ్మగూడ) గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండిండ్లు కాలిపోయి భారీ నష్టం జరిగింది. ఆదివారం కెరమెరి వారంతపు సంత కావడంతో కుటుంబీకులు సరుకులు కొనుగోలు చేసేందుకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. బారిక్‌రావ్ ఇంట్లో ఉన్న గ్యాస్ పేలిపోయి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన స్థానికులు వెంటనే బంధువులకు తెలపగా వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు బారిక్‌రావ్ ఇల్లు పూర్తిగా కాలిపోగా, లక్ష్మణ్ ఇల్లు కాలుతుండగా మంటలను అ